క్లుప్తంగా

అంకాలమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసి ఉన్న మహంకాళి (అంకాలమ్మ) బ్రహ్మోత్సవాలు ఆదివారం శుద్ధత్రయోదశి రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి అభిషేకం, ఆకుపూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకమైన పూలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పట్టువస్త్రాలను సమర్పించి అఖండ దీపాన్ని వెలిగించారు. ఈ దీపం బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు వెలుగుతూనే ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా కోటపోలేరమ్మ తిరునాల


కుంకుమబండి, బోనాలతో గ్రామోత్సవం

పోరుమామిళ్ల : పట్టణంలోని రంపాడు రోడ్డులో వెలసిన కోట పోలేరమ్మ తిరునాల శుక్ర, శని, ఆదివారాలలో వైభవంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక అలంకారంతోపాటు, అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు పట్టణ ప్రజలు బోనాలు సమర్పించుకున్నారు. మొక్కులు ఉన్నవారు కోళ్లు, మేకపోతులు బలి ఇచ్చారు. పోలేరమ్మ పుట్టిల్లు బలిజకోట నుంచి కుంకుమబండి గ్రామోత్సవం సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామోత్సవంలో బ్యాండు మేళాలు, తప్పెట్లు, చిందులతో హోరెత్తించారు. పూనకాలు వచ్చిన వారు ఊగిపోయారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి


ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చాపాడు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని మండల పరిషత్ అధ్యక్షుడు తెలిదెల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి కోరారు. చాపాడు మండలంలోని కేతవరం, లక్ష్మీపేట గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు


విజేతలకు ట్రోఫీ, మెడల్స్ అందిస్తున్న సూర్యప్రతాప్ రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక వైఎంఆర్ కాలనీలోని స్కాలర్స్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం భూమిరెడ్డి సూర్య ప్రతాప్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణ పరిధిలోని 20 కబడ్డీ జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. పాలిటెక్నిక్ కళాశాల జట్టు విజయం సాధించగా, శ్రీవిద్య జూనియర్ కాలేజీ జట్టు రన్నర్‌గా నిలిచింది. సూర్యప్రతాప్‌రెడ్డి విజేతగా నిలిచిన పాలిటెక్నిక్ కళాశాల జట్టుకు గోల్డ్ మెడల్, ట్రోఫీని, రన్నర్స్‌గా నిలిచిన శ్రీవిద్య జూనియర్ కాలేజీ జట్టుకు సిల్వర్ మెడల్ బహుకరించారు.

మాకు న్యాయం చేయండి

పోరుమామిళ్ల : తమకు న్యాయం చేయాలని పోరుమామిళ్లకు చెందిన షేక్ హుసేన్‌పీర్, ముత్తుముల మల్లికార్జునరెడ్డి కోరారు. వారు ఆదివారం విలేకరుల వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు. రంగసముద్రం పంచాయతీలో హుసేన్‌పీరాకు 1185/1లో 46 సెంట్లు, 1185/4లో 2.19 ఎకరాలు, మల్లికార్జునరెడ్డికి 1185/3లో 2.17 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో తమకు అన్ని ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. 2021లో నాలుగులేన్ల రహదారి కోసం చేసిన సర్వేలో హుసేన్‌పీరా భూమి 46 సెంట్లు, మల్లికార్జునరెడ్డి భూమి 44 సెంట్లు పోతున్నదన్నారు. అయితే గతేడాది సగిలి విజయకుమార్, గురయ్య ఆ భూమికి హక్కుదారులమని మండల రెవెన్యూ కార్యాలయంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకున్నారన్నారు. దీంతో బద్వేలు ఆర్డీఓ, పోరుమామిళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ బినామీ వ్యక్తులను నష్టపరిహారం కోసం ఎవరో వెనుక నుంచి ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. వాస్తవాలు పరిశీలించి, న్యాయం చేయాలని కోరారు.

పోలింగ్ స్టేషన్లు తెలుసుకోండి

బద్వేలు : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల పరిశీలన పూర్తయింది. అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ అధికారులు పర్యవేక్షణలో చేపడుతున్నారు. బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాలు, బద్వేలు మున్సిపాలిటీలకు సంబంధించి తొమ్మిది పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి విడతలో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 8,193 గ్రాడ్యుయేట్ ఓట్లు నమోదయ్యాయి. తదుపరి రెండో, మూడో విడతల్లో మరో 500కు పైగా ఓట్లు నమోదయ్యాయి. తుది ఓటరు జాబితాలు మండల కేంద్రాలకు చేరాయి. వీటితోపాటు ఓటరు స్లిప్పులు కూడా బీఎల్‌ఓలకు అందజేశారు. వీటిని ఈ నెల 8వ తేదీ లోపు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. గ్రామాలు, పట్టణాల్లోని ఓటర్లకు బీఎల్‌ఓ స్వయంగా అందజేసి సంతకాలు చేయించుకుంటున్నారు.

పోలింగ్ సేషన్ల వివరాలు

పట్టభద్రులకు సంబంధించి

కలసపాడు: 9వ తరగతి గది (సౌత్), జెడ్పీహెచ్‌ఎస్, కలసపాడు

కాశినాయన: 9వ తరగతి గది జెడ్పీహెచ్‌ఎస్, నరసాపురం

పోరుమామిళ్ల (రెండు బూత్‌లు) : బీఎస్సీ ఫైనలియర్, బీఏ సెంకడ్ ఇయర్ గదులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోరుమామిళ్ల


పోరుమామిళ్లలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

బి.కోడూరు: 8వ తరగతి గది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బి.కోడూరు

బద్వేలు (రెండు బూత్‌లు) : 10వ తరగతి బి సెక్షన్, 10వ తరగతి సి సెక్షన్, జెడ్పీహెచ్‌ఎస్ (బాలురు), బద్వేలు

గోపవరం (రెండు బూత్‌లు) : 1వ గది, 2వ గది ఫాతిమా ఉన్నత పాఠశాల, బద్వేలు

అట్లూరు : 8వ తరగతి గది, జెడ్పీహెచ్‌ఎస్, అట్లూరు

ఉపాధ్యాయులకు సంబంధించి

కలసపాడు : 9వ తరగతి గది(నార్త్), జెడ్పీహెచ్‌ఎస్, కలసపాడు

కాశినాయన: 10 వ తరగతి గది, జెడ్పీహెచ్‌ఎస్, నరసాపురం

పోరుమామిళ్ల : ఫస్ట్ బీకాం రూమ్ నెం-10, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోరుమామిళ్ల

బి.కోడూరు : 7వ తరగతి గది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బి.కోడూరు

బద్వేలు : 9వ తరగతి సీ సెక్షన్, జెడ్పీహెచ్‌ఎస్ (బాలురు), బద్వేలు

గోపవరం : రూమ్ నంబర్-3, ఫాతిమా ఉన్నత పాఠశాల, బద్వేలు

అట్లూరు : 7వ తరగతి గది, జెడ్పీహెచ్‌ఎస్, అట్లూరు

మొదటి విడతలో నమోదైన ఓటర్ల వివరాలు

మండలం	మహిళలు	పురుషులు
అట్లూరు	175	366
గోపవరం	666	1411
బద్వేలు	649	1348
బి.కోడూరు	96	325
పోరుమామిళ్ల	502	1204
కలసపాడు	193	575
కాశినాయన	153	529

వీటికి రెండో, మూడో విడతలో అదనంగా 500 మందికి పైగా ఓటర్లు నమోదయ్యారు.

కొర్ర.. రైతన్నకు ఊతకర్ర

మండలంలోని కుందూ పరీవాహక పరిధిలో సాగైన కొర్ర పంట ఆశాజనకంగా ఉంది. కుందూతోపాటు, కేసీ చాపాడు కాలువకు నీరు సంవృద్ధిగా రావడంతో ఈ సారి రైతులు కొర్ర సాగు విస్తృతంగా చేశారు. పంట పచ్చగా కళకళలాడుతూ ఉండటంతో పాటు ఆదారిలో వెళ్లే వాహనదారులను ఆకర్షిస్తోంది. దాదాపు 235 ఎకరాల్లో ఈ పంటను రైతులు సాగు చేశారు. గతేదాది సాగు చేసినప్పుడు దిగుబడులు బాగానే రావడంతో ఈఏడాది సాగు చేశామని రైతులు చెప్పారు.

– రాజుపాళెం


కొర్ర కంకులు


గోపాయపల్లె వద్ద సాగులో ఉన్న కొర్ర పంట

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించండి

బద్వేలు : పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలను గెలిపించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం పోరుమామిళ్ల మండలంలోని పుల్లివీడులో నాయకులు, ఓటర్లతో ఆయన సమావేశమయ్యారు. అభ్యర్థుల నమూనా బ్యాలెట్ పత్రాన్ని చూపి ఓటు వేయడంపై వారికి అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు. తమ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు అభ్యర్థిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


నమూనా బ్యాలెట్‌ను చూపుతున్న నాగార్జునరెడ్డి

యూనియన్ వ్యవస్థాపకుడికి ఘన నివాళి

మైదుకూరు : నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకుడు పి.రామ్మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా ఆదివారం మైదుకూరు ఆర్టీసీ డిపో ఆవరణలో ఎన్‌ఎంయూఏ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. అసోసియేషన్ డిపో కార్యదర్శి వీఎస్ రాయుడు ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ చంద్ర, డిపో కార్యదర్శి వీఎస్ రాయుడు మాట్లాడుతూ ఎన్‌ఎంయూ వ్యవస్థాపకుడి రామ్మోహన్ రావు ఆర్టీసీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, అనాథలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎన్‌ఎంయూఏ నాయకులు కేసీ కొండయ్య, జి.కుల్లాయప్ప, బీఎం శేఖర్, పి.ఆనందరావు, పి.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

9 నుంచి శంఖవరం ఉరుసు

కలసపాడు : మండలంలోని శంఖవరం గ్రామంలో గల దర్గాషరీఫ్ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ముజావర్ పి.ఓబయ్య తెలిపారు. స్థానికంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. 9న సయ్యద్ ఖాజారహమతుల్ల నాయబేరసూల్, బీబిహబీబా ఖాతూన్ గంధ మహోత్సవం జరుగుతుందన్నారు. గంధం సందర్భంగా పోరుమామిళ్ల ఆర్యవైశ్య దర్గా ప్రతినిధుల ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతుందన్నారు. గంధం రోజు రాత్రి బెంగళూరు వారిచే గొప్ప ఖవ్వాళి కార్యక్రమం ఉంటుందన్నారు. 10న రాత్రి ఉరుసు మహోత్సవం, భక్తులచే అన్నదానం ఉంటుందని తెలిపారు. 11న తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో ఉరుసు మహోత్సవాలు ముగుస్తాయన్నారు. స్వామివారి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉరుసు మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


శంఖవరంలోని దర్గాషరీఫ్ సమాధి

వ్యర్థాల తొలగింపు అభినందనీయం

బద్వేలు అర్బన్ : లంకమల అభయారణ్యంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లో శివరాత్రి సందర్భంగా భక్తులు వదలివెళ్ళిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని ఆర్డీఓ ఆకులవెంకటరమణ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నో ప్లాస్టిక్ లంకమల-3 విడత కార్యక్రమంలో భాగంగా ఆదివారం లోమాటి వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో లంకమలలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ లంకమలలో భక్తులు వదిలివెళ్ళిన ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా మూగజీవాలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉండటాన్ని గుర్తించి గత మూడేళ్ళుగా యువకులు వ్యర్థాల తొలగింపుకు నడుం బిగించడం గొప్ప విషయమన్నారు. సేకరించిన చెత్తను అటవీ ప్రాంతం బయటకు తరలించి కాల్చివేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఆఫీసర్ వెంకటశేషయ్య, ఎఫ్‌బీఓ రాజేష్‌రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు అరణ్యశేఖర్, కలువాయి గోవర్ధన్‌రెడ్డి, ఇన్‌టూద నేచర్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.


వ్యర్థాలను తొలగించేందుకు శ్రీకారం చుట్టిన యువతతో ఆర్డీఓ వెంకటరమణ

సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనం

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని గోపవరం సచివాలయం పరిధిలో ఆదివారం డాక్టర్ హానీఫ్ బాబా ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి, ఆడ పిల్లలను బతకనిద్దాం, చదివిద్దాం అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, సూపర్‌వైజర్లు వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య వైద్య సిబ్బంది

సీపీఆర్‌పై అవగాహన అవసరం

ప్రొద్దుటూరు కల్చరల్ : సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ కాల్వ విజయ నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక సరస్వతీ విద్యామందిరంలో ఆదివారం తైక్వాండో క్రీడాకారులకు సీపీఆర్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. సీపీఆర్ ఎలా చేయాలో అందరికీ అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు కమాల్, రాజేష్, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.


సీపీఆర్ గురించి వివరిస్తున్న డాక్టర్ విజయ నాగేంద్ర

చెరువుకట్టకు శాశ్వత పనులు చేపట్టాలి

- గత రెండేళ్లుగా తాత్కాలిక రింగ్‌బండే ఆధారం
- ఆగిపోయిన బస్సు రాకపోకలు

గోపవరం : గండిపడిన టీ.సండ్రపల్లె చెరువు కట్టకు శాశ్వత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండున్నర ఏళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు అప్పట్లో చెరువు కట్టకు భారీ గండి పడింది. యుద్ధప్రాతిపదికన నీటిపారుదల శాఖ అధికారులు కట్టకు తాత్కాలిక రింగ్‌బండ్ ఏర్పాటు వేసి రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించారు. గత మూడేళ్ళుగా బ్రహ్మంసాగర్ ద్వారా చెరువుకు సాగునీరు అందిస్తున్నారు. 2020 నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు గండి పడింది. అప్పటి నుంచి తాత్కాలిక రింగ్‌బండే ఆధారంగా ఉంది. ఈ ఏడాదైనా శాశ్వత పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. మండలంలో టీ.సండ్రపల్లె చెరువు కింద అధిక సంఖ్యలో ఆయకట్టు భూములు ఉన్నాయి. ఏళ్ళ తరబడి ఉన్న చెరువు కావడంతో చెరువు కట్ట కూడా పటిష్టతను కోల్పోయి లీకేజీకి గురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చెరువు కింద రబీలో వరిపంటను సాగు చేశారు. ఈ నెలాఖరుకు పంట పూర్తవడంతోపాటు చెరువులో ఉన్న నీరు కూడా ఖాళీ అవుతుంది. దీంతో వేసవిలో చెరువుకు మరమ్మతు పనులు చేపట్టి వచ్చే ఖరీఫ్‌లో ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు. అంతేకాకుండా రాచాయపేట నుంచి టీ.సండ్రపల్లె మీదుగా బుచ్చనపల్లె వరకు 5 గ్రామాలతో కూడిన రింగ్ రోడ్డు ఉంది. ఈ మార్గాన బస్సు రాకపోకలు జరుగుతుండేవి. చెరువుకు గండి పడిన తర్వాత బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో 5 గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తెగిన చెరువు కట్టకు శాశ్వత పనులు చేపట్టాలని రైతులతోపాటు ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


2020లో గండిపడిన టీ.సండ్రపల్లె చెరువు (ఫైల్)


గండి పడిన చోట వేసిన తాత్కాలిక రింగ్‌బండ్

భౌతికశాస్త్రంలో డాక్టరేట్

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన రాళ్లపల్లి రమణమ్మకు అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ వారు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. భౌతికశాస్త్రంలో 'నానో సెరామిక్స్ బేస్‌డ్ హైబ్రిడ్ సూపర్‌కెపాసిటర్స్ ఫర్ ఎనర్జీ స్టోరేజ్ అప్లికేషన్స్' మీద ఆమె పరిశోధన పత్రం సమర్పించారు. బ్యాటరీ, సూపర్ కెపాసిటర్ల శక్తి, సామర్థ్యం పెంచుటకు ఇది దోహద పడుతుందని ఆమె తెలిపారు. ఈ పరిశోధన పత్రంపై యూనివర్సిటీ వారు డాక్టరేట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నంద్యాల ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.


రమణమ్మ

వైద్యశిబిరం విజయవంతం

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వైద్యుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. అక్కడకు వచ్చిన రోగులకు వైద్యులు అక్షిత్, పవన్‌కుమార్‌రెడ్డి, గురుమూర్తి, గురు అభిలాష్, లక్ష్మీ ధరణీధర్ రెడ్డి, యోగానందరెడ్డి పరీక్షలు చేశారు. మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీదేవికి మకర తోరణం బహూకరణ


పార్వతీదేవికి మకర తోరణంను తొడిగిన దృశ్యం

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి దాత యిత్తడితో మకర తోరణంను బహుకరించారు. కుమ్మరపల్లె గ్రామానికి చెందిన పాలగిరి దామోదర్‌రెడ్డి ఆయన సతీమణి కానాల రాధ (పగిడాల సర్పంచ్) యిత్తడితో రూ.20 వేలు ఖర్చు చేసి తయారు చేయించినట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు.

సాధనతో ఉత్తమ ఫలితాలు

కడప స్పోర్ట్స్: క్రీడాకారులకు నిరంతర సాధన, పట్టుదల, ఆసక్తి ఉంటే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ శిక్షకుడు మస్తాన్‌హుస్సేన్ ఆధ్వర్యంలో రెజ్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్టెప్ సీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడికి క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. శిక్షణలో బాగా మెలుకువలు నేర్చుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు.

అల్లాడుపల్లె వేద పండితుడికి అరుదైన గౌరవం

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థాన సామవేద పండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మ ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని సికింద్రాబాద్‌లోని సర్ సీవీ రామన్ అకాడమి సేవా సాంస్కృతిక సంస్థ చేత అరుదైన గౌవరం అందుకున్నారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా 8 రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాలలో నిష్ణాతులైన ఎనిమిది మందిని ఎంపిక చేసి సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవనంలో సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా నరేంద్ర శర్మను సామవేద శిఖామణి బిరుదుతో పాటు కంకణాన్ని అందజేశారు. కడప జిల్లా నుంచి నరేంద్ర శర్మ ఒక్కరే ఎంపికవటం గమనార్హం.


సుమన్ చేతుల మీదుగా సామవేద శిఖామణి బిరుదు, కంకణం అందుకుంటున్న నరేంద్ర శర్మ

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్‌మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో ఆదివారం జేవీవీ పట్టణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీవీ మూఢ నమ్మకాలను తొలగించి ప్రజలను చైతన్యవంతులను చేయడంలో ముందుందన్నారు. జేవీవీ చెకుముకి కార్యక్రమం ఎంతో ప్రాచుర్యాన్ని పొందిందన్నారు. సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించి విద్యార్థుల్లో ఆలోచనా విధానాన్ని పెంపాదిస్తున్నామన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలంకి శ్రీరాములు, నాయకులు మురళీ గుప్త, సునీత, గోపీనాథరెడ్డి, ప్రకాష్, అంకమ్మ, ఈశ్వరయ్య, శ్వేత, శర్వాణి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తవ్వా సురేష్‌రెడ్డి

ప్రణాళికతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు

బద్వేలు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆ పార్టీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు జగన్‌మోహన్‌రెడ్డిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. ఇందుకుగాను ప్రతి గ్రామంలో ఓటర్లను ప్రత్యేకంగా కలిసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. మండలాల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ మండల కన్వీనర్లు, గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రాడ్యుయేట్లు పార్టీ అభ్యర్థులకు ఓటు వేసేలా చూడాలన్నారు. మండలాల వారీగా కొంత మందికి బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. వీరు నిరంతరం ఓటర్లతో మమేకమై పార్టీ అభ్యర్థులకు మెజార్టీ తెచ్చేలా చూడాలని పేర్కొన్నారు.


ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి, ఎన్నికల పరిశీలకులు జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


లక్ష్మీపేట హైస్కూల్లో 1993 నాటి పదో తరగతి విద్యార్థులు

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం సన్నిధిలోని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. సమావేశానికి ముఖ్య హాజరైన అప్పటి ఉపాధ్యాయుడు సాంబ శివారెడ్డి మాట్లాడుతూ.. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవడం ప్రస్తుతం వారికి చూస్తే సంతోషంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో స్థిర పడిన విద్యార్థులందరికీ కలుసుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు జాన్, పుల్లారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.